


సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 10 ఆగస్టు, 2013 సంచిక : 3

(విజయ నామ సం॥, ఆషాఢ మాసం)



**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావుగారు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech


**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| విడి ప్రతి | రూ॥ | 6/- |
| వార్షిక చందా | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం | రూ॥ | 600/- |


**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com


**విషయసూచిక** **పుట సంఖ్య**


మా వాణి .......... 2

సాయితో తర్ఖడ్ స్మృతులు-3 .......... 5

శ్రీ సాయి సేవ .......... 9

షిరిడీ (కపర్దే) డైరీ .......... 12

మౌనదీక్ష .......... 14

అదెవరు? .......... 15

చరిత్రమఱుగున .......... 17

ఒక విదేశీయుని .......... 22

కర్మలో ధర్మం .......... 25

ఏకదృష్టి .......... 26

స్వరాంజలి .......... 28

బాలవాణి .......... 29

రామకృష్ణ ఉవాచ .......... 31

వరలక్ష్మీ వ్రతం .......... 32








## మా వాణి



# వేచి ఉండు-వేగిరపడకు

ఎక్కడో దూరతీరాలనుంచీ-సప్త సముద్రాలకు ఆవల-చిట్టడవిలో-చింతమాను త్రోవలో అన్న అనగనగా కథల్లో లాగా - నాకు నోరు తిరిగి చావని ఏదో ఊరి నుంచీ ఓ ఫోన్ పిలుపు, పలకరింపు. 'హలో'

'ఎవరమ్మా?' 'నేను మీ స్టూడెంట్‌ను. నమస్కారమండీ! నాపేరు శుభప్రియ. మీ జ్ఞాపకాల పొరల్లో ఎక్కడైనా యీ పేరు మిగిలి ఉందాండీ మేడమ్!" చటుక్కున ఎక్కడో ఓ స్మృతి .....

'ఆఁ! గుర్తున్నదమ్మా! ఏమిటీ - యిన్నేళ్లకు - మూడో, మూడున్నరో దశాబ్దాల తరువాత ఎలా పట్టుకున్నావు నా నంబరు?"

"అబ్బో! అదంతా చాలా పెద్ద కథ మేడమ్! పదిహేనేళ్లుగా భారతదేశం వచ్చినప్పుడంతా ఆచూకీలు తీస్తూ, వెదుకుతూ రాగా రాగా - చివ్వరికిప్పుడు దొరకబుచ్చుకోగలిగాను. ఆఁ! అన్నట్లు అసలు సంగతి చెప్తాను. మేమందరం పరీక్షలైపోయి, మీ దగ్గర సెలవు తీసుకోవటానికి వచ్చినపుడు-నా ఆటోగ్రాఫ్ పుస్తకంలో మీరొక మాట వ్రాసారు. అది ఎన్నో సార్లు నాకు మార్గోపదేశం చేసింది గత ముప్ఫై నాలుగేళ్లలో. ఏ యిబ్బంది కలిగినా, ఏ సంబరం ఉప్పొంగినా మీ మాటలే అటు కుంగిపోకుండానూ, యిటు మైమరచేంతగా పొంగి పోకుండానూ కూడా నన్ను నన్నుగా నిలబెట్టాయి. అంత అమూల్యమైన సందేశం నాకిచ్చినందుకు మీకు కృతజ్ఞతలు చెప్పాలని ఎన్నాళ్లుగా మీ కోసం వెదుకుతున్నానో!"

"ఇంతకీ ఏమిటమ్మా అంతోటి గొప్ప సందేశం?"

"అయ్యో, అవి మీ మాటలు గనుక మీకు తేలిగ్గా కనిపించవచ్చు. మాకు మాత్రం అమూల్యమే. "థింక్ ఎబౌట్ నైట్ యిన్ డే టైమ్-థింక్

ఎబౌట్ డే ఇన్ నైట్" అని వ్రాసారు మీరు. అది నాలో ఎన్నెన్నో అర్థాలు నిద్రలేపింది. ఎన్నోసార్లు నాకు తోడై నడిపింది. మేడమ్, మీరిలాగే మీ చుట్టూ ఉన్న వాళ్లకు స్ఫూర్తినిస్తూ, నిండు నూరేళ్లూ జీవించాలని బాబాను ప్రార్థిస్తాను. ఈసారి మన గడ్డ మీద దిగిన వారంలోపే మీ దర్శనం చేసుకొంటాను. నన్ను ఆశీర్వదించి సెలవివ్వండి మేడమ్!" "మంచిది తల్లీ శుభమస్తు!"

✡ ✡ ✡

శుభప్రియకే కాదు ఆ వాక్యం ఎప్పడైనా, ఎవరికైనా శిరోధార్యమే. నన్ను నడిపింది అదే. "వెలుగులో ఉండి చీకటి గురించీ, చీకట్లో ఉండి వేకువను గూర్చీ ఆలోచించు". 'నరుడికి నాలుగు దశలు' అన్నారు పెద్దలు. కాలం ఎప్పడూ ఒకేలాగా నడవదు. మొదట కాళ్లూ చేతులూ ఉపయోగించి జంతువులాగే పాకుతాడు. మెల్లమెల్లగా లేచి నిలబడి తప్పటడుగులు వేస్తూ పడుతూ లేస్తూ ఎలాగో మొత్తం మీద నడక నేర్చుకొంటాడు. మరికొద్దికాలానికి పరుగెత్తటం, స్థిరంగా నడవటం ... కౌమారం, యౌవనం, నడివయసు ..... చూస్తూ చూస్తూ వార్థక్యం ముసురుకు వస్తుంది. రెండుకాళ్లతో నడిచే శక్తి పోయి, మూడో కాలి అవసరం వస్తుంది. విల్లులా వంగి వీపు మీద చేయి పెట్టుకొని, మళ్లీ శైశవంలోలాగే తప్పటడుగులు వేస్తూ, వేస్తూ...... చివరికి అసలే కదలడం మానేస్తాడు. నడకలో యిలా ఎన్ని దశలుంటాయో-జీవితంలోనూ యిన్ని దశలుంటాయి. కొన్నాళ్లు ఆనందమయ మైన, ఐశ్వర్యవంతమైన జీవితం, ఇంకొన్నాళ్లు ఒడిదుడుకుల జీవితం, మరికొన్నాళ్లు ఏదో బ్రతుకీడవడం-యిలా ఎన్నో తీరులు. మనం అందరం సాధారణంగా సుఖాలను, ఆనందాలను ప్రేమిస్తాం, ఆహ్వానిస్తాం. కానీ విషాదాన్నీ, బాధలనూ భరించలేము సరిగదా-అయ్యో, బాబో అని అంగ లారుస్తాం. చేదుచిగుళ్లు నమిలిన కోకిల గొంతుకే తీపిరాగాలు అబ్బుతాయని మరిచిపోతాం.

అందరికీ తెలుసు-పగటి తరువాత రాత్రి రాక తప్పదనీ, రాత్రి చీకట్లు వేకువకు విచ్చిపోక తప్పదనీను. అయినాగానీ ఒక పెద్ద పొరపాటు





చేస్తాము. కష్టంరాగానే యిక భూనభోంతరాళాలన్నీ ఏకమయ్యేలా దుఃఖిస్తాము. భయపడిపోతాం. ఇంత పెద్ద కష్టం యిచ్చిన (పాపం!) దైవాన్ని నిందిస్తాం కూడా. అలాగే సుఖం రాగానే యిదేదో శాశ్వతమన్నట్లు పొంగిపోతాం, విర్రవీగుతాం. అది కాస్తా కరిగిపోయాక మళ్లీ కథ మామూలే. అందుకే పెద్దలన్నారు-"ఇదీ గడిచిపోతుంది' అన్న విషయం పదేపదే గుర్తు చేసుకొమ్మని. దీని వెనుక ఒక రహస్యం ఉంది. దుఃఖం శాశ్వతమన్నట్లు కుంగిపోతే మనలోని ఆశాభావం, ఆత్మస్థైర్యం నశించి పోతాయి. కార్యాచరణశక్తి తరిగిపోతుంది. వ్యర్థులమైపోతాం. సుఖమే స్థిరమనుకొంటే మనలో అలసత్వం, దైవానుగ్రహం వలననే సుఖం కలిగిందన్న భావన, సాటి జనావళి పట్ల సానుభూతి అన్నీ వెనుకబట్టి పోతాయి. అందుచేత యివి రెండూ తప్పలే. బాగుందే-ఎప్పడు కలిగిన అనుభవాన్ని అప్పడు స్వీకరించకుండా ఎలా ఉండటం? ఎప్పడో విషాదం రానున్నదన్న దిగులుతో యిప్పటి ఆనందాన్ని వదులుకోవటం ఎలా? అంటారేమో! సుఖాన్ని అనుభవించండి. కానీ, సంయమనంతో, నిగ్రహంతో. ఇవ్వేళ ఉన్నాయి. అలా అని వీటికే అలవాటు పడిపోతే రేపు లేనినాడు బ్రతుకు భరించటం కష్టం గదా! అందుచేత ఆనందంతోపాటు అణుకువ కూడా ఉంచుకోవాలి. ఈ సంపత్తిని ఏ సత్కార్యాలకు ఎలా ఉపయోగించాలో, ఏ రకంగా ఉత్తమ జీవితాన్ని గడపాలో ఆలోచించాలి. అలాగే దుఃఖాన్ని ఎలా 'సబూరీ'తో-ఆనందపూర్వకమైన ఓర్మితో మంచిరోజుల కోసం వేచి ఉండాలి. ఆ భావాన్నే "వెలుగులో చీకటి గురించి గుర్తుంచుకో. చీకటిలో వెలుగు గురించి ఆశ పెంచుకో" అని చెప్పారు పెద్దలు. ఇంతే కాదు ఈ వాక్యంలో మరో సందేశం కూడా ఉంది. యౌవ్వనంలో శ్రమించి వృద్ధాప్యం ప్రశాంతంగా నడవడానికి వీలైన ఏర్పాట్లు, అలవాట్లు చేసుకోవాలి. అలాగే శక్తి వున్నపుడే సత్కర్యాచరణ చేసి నరకబాధల నుంచి తప్పించుకొని మరుజన్మ మంచిది పొందే ప్రయత్నం చేయాలి-గుర్తుంచుకుందాం.

# సాయితో తర్ఖడ్ స్మృతులు-3

**- శ్రీ వీరేంద్ర జ్యోతీంద్ర తర్ఖడ్**

**(గత సంచిక తరువాయి)**

ఇంతకు ముందు వివరించినట్లుగా తర్ఖడ్ కుటుంబం వారికి షిరిడీ దర్శనాలు ఎక్కువయ్యాయి. బాబా వారి ప్రేమ పూర్ణచంద్రోదయంలాగ వృద్ధి పొందుతూ వచ్చింది. షిరిడీలో ఉన్నపుడెల్లా వారు, తాము బాబా వారి పాదాల వద్దే ఉంటున్నామని అనుకుంటున్నప్పటికీ, ప్రతిసారి అది సాధ్యం కాదు. బాంద్రాలోని తమ యింటిలో ఉంచుకొని పూజించుకోవడానికి ఒక పెద్దసైజు బాబా ఫొటో ఉంచుకోవాలనే కోర్కె వారిలో బలంగా పెంపొందింది. దీని వెనుక ఉన్న ఆలోచన యేమిటంటే వారు షిరిడీ నుండి వచ్చాక, బాబా వారిని తమ దృష్టిపథం నుండి, మనసులోను మరిచిపోకుండా ఉండటానికి. తండ్రీ కొడుకులిద్దరిదీ కూడ ఒక విచిత్రమైన మనస్తత్వం. వారెప్పడూ కూడ బాబా మీద తమకున్న ప్రేమని గూర్చి ఒకరికొకరు చర్చించుకునేవారు కాదు. వారికి బాబా మీద అపరిమితమైన నమ్మకం. ఆయన తమ మనస్సును తెలుసుకొని, సరియైన సమయంలో తమ కోరికలను తప్పక తీర్చడానికి యేర్పాటు చేసే సర్వాంతర్యామి అని వారికి తెలుసు. అందుచేత బాబావారు చెప్పిన రెండు ముఖ్యమైన విషయాలు శ్రద్ధ, సబూరి పాటించేవారు.

ఒకరోజు తెల్లవారుఝామున బాబాసాహెబ్‌గారికి, జ్యోతీంద్రగారికి కల వచ్చింది. వారికి వచ్చిన కలలో వారు అందంగా చెక్కబడిన మందిరంలో బాబా కూర్చుని ఉండటం చూసారు. ఆ కల వారి మనసులో గాఢమైన ముద్ర వేసింది. వారిద్దరూ మంచి చిత్రకారులు కాబట్టి లేచిన తరువాత తాము కలలో చూచిన మందిరం చిత్రం గీశారు వారిద్దరూ. ఫలహారం





చేయడానికి డైనింగ్ టేబుల్ వద్దకు వచ్చినప్పడు యిద్దరూ కూడ ఒకరి ఆలోచనలు ఒకరికి చెప్పకుని, ఉదయాన్నే తమకు వచ్చిన కలల గురించి విని, ఒక్కలాగే ఉండటంతో ఆశ్చర్యానికి లోనయ్యారు. గీచిన బొమ్మలు చూసి రెండు కూడ ఒక్కలాగే ఉండటంతో ఆశ్చర్యానికి లోనయ్యారు. వారు వెంటనే అటువంటి మందిరం తమ యింటిలో ఉండాలనే నిర్ణయానికి వచ్చారు. వారిద్దరూ అన్వేషణ చేసి చందనపు కలపని కొన్నారు. ఒక మంచి వడ్రంగిని నియమించి తాము వేసిన చిత్రాలను చూపించి అటువంటిది ఒక్కటి చెక్కి యిమ్మని పురమాయించారు. వారు ఉన్న బాంద్రా యింటికి చిన్న డాబా ఉంది. అక్కడ మందిరపు నిర్మాణపు పని ప్రారంభమయింది. మందిరం పూర్తవడానికి సంవత్సరం పైన పట్టిందనుకుంటాను. చివరికి చందనపు మందిరం తొమ్మిది (9)అడుగుల పొడవు, 2 1/2, 2 1/2 చ.అ.తో తయారయింది. ఇపుడు వారికి ఒక సందేహం వచ్చింది. మందిరంలో పెట్టి పూజించడానికి బాబా పటాన్ని ఎక్కడ నుంచి తేవాలి?

ప్రియ పాఠకులారా! బాబాగారెప్పడూ తనని కెమేరాతో ఫొటో తీయనిచ్చేవారు కాదని మీకందరుకూ తెలుసు. అందుచేత ఆయన ఫొటో సంపాదించడమనేది కష్టసాధ్యమయిన విషయం. కాని తమకు వచ్చిన కల కూడా బాబాగారి సృష్టే కాబట్టి. అంతా ఆయనే చూసుకుంటారనే ధీమాతో, నమ్మకంతో ఉన్నారు. వారి అలవాటు ప్రకారం ఒక శుక్రవారము నాడు మధ్యాహ్నం బొంబాయిలోని చోర్ బజార్‌కి వెళ్ళారు.

వారెప్పడూ వేసుకునే దుస్తులు అంటే బాబాసాహెబ్ కోటు, పైజమా, ఆంగ్ల టోపీ, జ్యోతీంద్రగారి కోటు, పైజమా, నలుపురంగు గాంధీ టోపీ ధరించారు. వారిద్దరూ చోర్‌బజార్ సందులలో తిరుగుతూ వెడుతున్నపుడు ఒక అద్వితీయమైన సంఘటన జరిగింది. ఒక ముస్లిం షాపు యజమాని గట్టిగా అరుస్తూ వచ్చి "యేయ్! దొరలూ, యిన్ని రోజులుగా మిమ్మల్ని కలుసు

కోవాలని ఎదురుచూస్తున్నాను. నా దుకాణంలో మీకొక పార్శిల్ ఉంది" అన్నాడు. బాబాసాహెబ్‌గారు, జ్యోతీంద్రగారు తెల్లబోతే ఆ షాపతను "అంతా వివరంగా చెబుతాను ముందు షాపులోకి రండి" అని కోరాడు. షాపులోకి వచ్చిన తరువాత "కొద్దిరోజుల క్రితం సాధువులా ఉన్న వయసు మళ్ళిన ఒక పెద్దమనిషి వచ్చి తనకు ఒక పార్శిల్ యిచ్చినట్లు చెప్పాడు. ఆయన ఒక శుక్రవారమునాడు హిందువులైన తండ్రి, కొడుకులు ఈ ప్రదేశానికి వస్తారని చెప్పాడు. వారి కోసం ఒక పార్శిల్ యిచ్చి, ఈ పని చేసి పెట్టినందులకుగాను రూ.50/- కూడ యిచ్చినట్లు చెప్పాడు. అందుచేత జంటగా వచ్చే మనుషులందరినీ తాను జాగ్రత్తగా గమనిస్తున్నట్లు, యిప్పుడు తమని సరిగా గుర్తించినట్లు చెప్పాడు. అప్పుడతను ఆ పార్శిల్ తీసుకువచ్చి వారికందించాడు. అది దొంగిలించిన సొత్తేమోనని వారికింకా అనుమానంగా ఉంది. అందుచేత తీసుకునే ముందు అతని చేతనే ఆ పార్శిల్ విప్పించారు. షాపతను పార్శిల్ విప్పాడు. అది చక్కటి చెక్కఫ్రేములో బిగించబడి ఉన్న నలుపు, తెలుపు రంగులలో ఉన్న బాబా చిత్రపటం. వారిద్దరి కళ్ళూ ఆనందబాష్పాలతో నిండిపోయాయి. ఆ పార్శిల్ తమకు ఉద్దేశించినదే అని నిర్ధారించారు. వారు అతనికి ఎంతో కృతజ్ఞతలు చెప్పి కొంత డబ్బు ఇవ్వజూపారు. ఆ పార్శిల్ యిచ్చిన వ్యక్తి ఖచ్చితమైన ఆజ్ఞ యివ్వడం వలన తాను ఏ విధమైన డబ్బు తీసుకోనని నిరాకరించాడు. వారెప్పుడూ స్టుడ్ బేకర్ కారులో ప్రయాణిస్తూ ఉంటారు. కాబట్టి వారా ఫొటోని జాగ్రత్తగా బాంద్రాకు తీసుకువెళ్ళగలిగారు. వాళ్ళకు ఆనందకరమైన, ఆశ్చర్యకరమైనదొకటి జరిగింది. అదేమిటంటే ఆ ఫొటోఫ్రేము ఎటువంటి మార్పులు చేయబడకుండానే మందిరంలో సరిగా సరిపోయింది. తార్ఖడ్ కుటుంబమంతా సంతోషంతో పొంగిపోయింది. వారి సంతోషానికి అవధులు లేవు. వారా సాయిబాబా ఫొటోని చందనపు మందిరంలో





ప్రతిష్ఠించారు.

మా నాన్నగారు హిందూ సాంప్రదాయం ప్రకారం ఉదయం 5 గం.లకే నిద్రలేచి బాబా నుదుటిమీద చందనం అద్ది, దీపం, అగరవత్తులు వెలిగించి పూజ చేస్తూ ఉండేవారు. పంచదార పలుకులు నైవేద్యం పెట్టి, మధ్యాహ్న భోజనం సమయంలో తీసుకుంటూ ఉండేవారు. వారంతా యిప్పుడు తమ తరువాతి షిరిడీ యాత్ర కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. మామూలుగా వారు ద్వారకామాయిలోకి ప్రవేశించి, బాబాగారికి సమర్పించేవి కానుకగా ఇచ్చారు. ఆయన వారిని అక్కడ కూర్చొమ్మని చెప్పారు. షిరిడీలో ఉన్న సాయిభక్తులలో ఒక భక్తుడు, గత కొద్దిరోజులుగా బాబా ఫొటో తీయడానికి విఫలప్రయత్నం చేస్తూ తీయలేకపోయి ఆఖరి ప్రయత్నంగా బాబాను కోరాడు. బాబా వెంటనే కోపగించి గట్టిగా అరుస్తూ "ఏయ్ నువ్వు నా ఫొటోని ఎందుకు తీస్తున్నావు? నువు నా భావూ చోటకి వెళ్ళు, అక్కడ మందిరంలో ఉన్న ఫొటోలో నువ్వు నన్ను సజీవంగా చూడవచ్చు" అన్నారు. ఇది విన్న వెంటనే మా నాన్నగారు వెంటనే లేచి బాబా ముందు సాష్టాంగ నమస్కారం చేశారు. మా నాన్నగారు తాను సాయిని మరచిపోగలిగే దుష్ట ఆలోచన రాకుండాను, ఆయన పాటలనే పాడుతూ ఆయన మీద ప్రార్థన చేసేటట్లుగా వరమివ్వమని మనస్సులోనే ప్రార్థించారు. (హేచిదాన్ దేగా దేవా తుఝా వీసర నావ్హావా) ఈ విధంగా షిరిడీ సాయిబాబావారు తమంత తాముగా తర్ఖడ్ గారి యింటిలోని చందనపు మందిరంలోకి ప్రతిష్ఠింపబడ్డారు.

స్వర్గీయ నా సోదరుడు వాసిలో ఉన్న రవీంద్రగారి యింటిలో యీ మందిరాన్ని దర్శించవచ్చు. మేమంతా చూస్తున్నాము. అనుభూతి చెందుతున్నాము. ఈ ప్రపంచం అంతమయేంతవరకు యిదిలా జరుగుతూనే ఉంటుందని నాకు తెలుసు.

# శ్రీ సాయి-సేవ

## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

**(గత సంచిక తరువాయి)**

పూజ్యశ్రీ కందుకూరి వీరేశలింగంగారు తెలుగింటి ఆడపడచు లందరూ దీపంబెట్టి దణ్ణం పెట్టుకోవలసిన పుణ్యాత్ములు. పుడుతూనే ఆస్తాతో పుట్టారు. దాదాపు ఏడున్నర దశాబ్దాల జీవితకాలమంతా అది ఆయనతోనే ఉంది. ఆయన మహా మొండిమనిషి. ఆయన సేవ చెయ్యని రంగం లేదు. ఆంధ్రకవుల చరిత్ర వ్రాసి ఎందరెందరో ప్రాచీన కవులను వెలుగులోకి తెచ్చారు. మొదటి తెలుగు నవల ఆయనదే. తొలి హాస్యనాటిక ఆయనదే. “నిరోష్ఠ్య నిర్వచన శుద్ధాంధ్ర నైషధం” అని పలుగురాళ్ల లాంటి మాటలతో కావ్యం వ్రాసిన చేత్తోనే సత్యవతీ చరిత్రం, సత్యరాజా పూర్వదేశ యాత్రలు వంటి సరళ గ్రాంథిక వచన రచనలూ చేసారు.

తొలి హాస్య పత్రిక నడిపింది వారే. ఎనాటమీ మీద తెలుగులో మంచి గ్రంథాలు లేవని కోపం తెచ్చుకొని, ఆపరేషన్ థియేటర్లో నిలబడి, శరీరాన్ని డిసెక్ట్ చెయ్యటం చూచి, ఎనాటమీ మీద మంచి పుస్తకం వ్రాసారు. ఇదంతా సాహిత్యానికి చేసిన సేవ. ఆ గ్రంథాల మీది ఆదాయమంతా సేవకే ఉపయోగించారు.

మరోవైపు బాల్యవివాహ నిరసన, స్త్రీ విద్యా ప్రోత్సాహం, వితంతు వివాహాలు, సమాజంలో నైతికత పెంచాలన్న తపనతో వివేకవర్ధని నడపడం-ఎన్నెన్ని తీరుల సేవారంగాలలోనో ధ్రువతారగా నిలిచారాయన. ఇవన్నీ ఆనాటికి క్రొత్తవే. సమాజ వ్యతిరేకతను భరిస్తూ, పోరాడుతూ, చేపట్టిన కార్యం విడవకుండా ముందుకు నడుస్తూనే ఉన్నారాయన.





రాజమండ్రి పురపాలక సంస్థకు ఆయన గణనీయమైన సేవ చేసారు. టౌన్‌హాల్ కట్టించారు. ఇది సమాజ సంస్కరణల కోసం చేసింది.

ఎవరెవరో కన్నబిడ్డలను తన గడపలో వదిలేసిపోతే (బాల వితంతువులు-ఆరు-పది మధ్య వయస్సుల) వాళ్లను చేరదీసి, అక్షరాస్యు లను చేసి, సంస్కారం నేర్పి, తగిన వరులను వెదికి, వాళ్లుండటానికి ఇళ్లు, జీవనోపాధికి ఏర్పాట్లు చేసి ఏ లోటూ లేకుండా వివాహాలు చేసి పంపారు.

అలా ఆ పరమపుణ్య పురుషుడు చేసిన వితంతు వివాహాలు ముప్పై ఏడు. అందులో ఒకమ్మాయి పురిట్లో చచ్చిపోతే ఆ కన్న శిశువును తెచ్చి తానే పెంచి పెద్ద చేసారు. ఇవన్నీ చాలా కఠినాతి కఠినమైన పరీక్షలను ఎదుర్కొంటూ చేసినవే. అందులో తనకు ఆర్థికంగా సహకరించే ఒక పెద్దమనిషి ఏదో అనైతిక కార్యానికి పాల్పడ్డారని తెలిసి, తన పత్రిక ద్వారా ఆయనను రచ్చకీడ్చి న్యాయం నిలపడానికి సేవ చేసారు. తనకు దన్ను ఇవ్వటం కంటే ఆయన నీతిమంతుడుగా ఉండటమే ముఖ్యమని భావించారు.

అలాంటి వీరేశలింగంగారికి ఎవ్వరూ ‘ఇంత చేసాడు’ అని కృతజ్ఞతలు చెప్పలేదు. ఆయన రాజమండ్రిలో వివిధసేవలకుగాను ఇచ్చిపోయిన ఆస్తి విలువ ఇప్పుడు దాదాపు అయిదు కోట్లున్నది. అలాంటివారు భార్య రాజ్యలక్ష్మమ్మగారి మరణానంతరం సుబ్బారావనే శిష్యుడి కోరికపై అతనింట్లో భోజనం చేయటం మొదలుపెట్టారు. సుబ్బారావు భార్య సుందరమ్మను వీరేశలింగంగారే పెంచి పెద్ద చేసి పెళ్లి చేసారు. అంత లబ్ధి పొందిన సుందరమ్మ వీరేశలింగంగారికి భోజనం పెట్టటానికి విసుక్కున్నది. ఇంత కూర తెచ్చి ఎత్తి వేసింది.

ఈ విషయం తన ఆత్మకథలో వ్రాసుకున్న వీరేశలింగంగారు వారికి కృతజ్ఞత లేకపోయిందే అని బాధపడలేదు. “రాజ్యలక్ష్మమ్మ గుర్తుకు వచ్చి

నా కనుల నీరు తిరిగినది" అని వ్రాసుకున్నారు అంతే. పోనీ యీ సేవ వలన ఏమీ లాభం ఉండదనుకున్నారా... లేదు. పైగా -

"ఓ రాజమహేంద్రపురవాసులారా, అస్మద్దేశీయులారా, ఇంతకాలం యీ దీపాన్ని ఎలాగో పట్టుకొచ్చాను. ఇప్పుడు వృద్ధుడినైనాను. నా చేతులు వణుకుతున్నాయి. కనుక మీరు ముందుకు రండి. ఈ దీపం ఆరిపోకుండా చేతులు అడ్డుపెట్టి కాపాడుకోండి" అని వేడుకున్నారు. సేవ ఎక్కడ ఆగిపోతోందోనని ఆవేదన చెందారు.

అంతటి సేవ చేసిన వీరేశలింగంగారు సమాజం తనకు వంగి నమస్కరించాలని కోరుకోలేదు. "ప్రభువా, వారేమి చేయుచున్నారో వారికి తెలియదు. వారిని క్షమించుము" అని సిలువపై ఏసుక్రీస్తు దైవాన్ని వేడుకున్నట్లు-యీయన సమాజాన్ని వేడుకున్నారే తప్ప విడిచిపెట్టలేదు.

అదీ సేవకునికి ఉండవలసిన హృదయం.

**(సశేషం)**


**"సాయివాణి" పాఠకులకు,**

**సాయిభక్తులకు, శ్రేయోభిలాషులకు**

**స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు**





మరియు

**రక్షాబంధనం శుభాకాంక్షలు**








ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

**- మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే**

**అనువాదం : మాతా శుకవాణి**

(గత సంచిక తరువాయి)

11-12-1911

ఇవ్వేళ ఉదయ ప్రార్థన చాలా ఆనందదాయకంగా ఉండి, నాలో ఒక దీప్తి కలిగినట్లనిపించింది. తరువాత పంచదశిలో నుంచీ కొన్ని శ్లోక పాదాలు చిట్నీస్‌కు వివరిస్తూ కూర్చున్నాను. అతను చాలా మంచి మనిషి. తరువాత మేము సాయి మహరాజ్ బయటికి వెడుతుండగానూ, తిరిగి వచ్చాకా కూడా దర్శనం చేసుకున్నాము. సాయి నాకు చిల్లం, రాధాకృష్ణమాయి పంపిన ద్రాక్షపళ్లు తరచుగా యిస్తుండేవారు. మా అబ్బాయి బల్వంత్‌కు రెండుసార్లు ద్రాక్షలిచ్చారు. ఆ సాయంత్రం ఆయన మసీదు శుభ్రం చేసుకుంటున్నారని అటువైపు వెళ్లలేదు. జనమంతా ప్లేగు వ్యాధిని దూరం చెయ్యవలసిందిగా సాయిమహరాజ్‌కు విన్నవించుకొన్నారు. అప్పుడాయన వీధులు, సమాధులు, గోరీల ఘాట్‌లు అన్నీ శుభ్రం చేసి, పేదలకు అన్నదానం చేయమన్నారు.

ఆ సాయంత్రమంతా వార్తాపత్రికల చదువుతూ చిట్నీస్‌తో తదితరులతో మాట్లాడుతూ ప్రొద్దుపుచ్చాను ఉపాసనీ ఏదో వ్రాస్తున్నారు. ఆ సాయంత్రం సాయి మహరాజును చావడి దగ్గర చూచాము. చిట్నీస్‌తో కలిసి శేజారతికి వెళ్లాను. ఆపైన చిట్నీస్ తన ఇంజనీర్ మిత్రునితో మరొకరితో కలిసి వెళ్లిపోయాడు.

12-12-1911

నేనూ, భీష్మ కాకడ హారతి వేళైపోతున్నదనుకొని నిద్ర లేచాం గానీ అప్పటి

కింకా గంట టైముంది. తరువాత మేఘా వచ్చాడు. కలిసి హారతికి వెళ్లాము. సాయి మహరాజు బయటికి వెళ్లి తిరిగి వచ్చేవరకు నేను ప్రార్థన చేసుకుంటూ, గోఖలే పాటలు వింటూ ఉన్నాను. అతను బాగా పాడుతాడు. మేఘాకు మారేడు ఆకులు దొరక్క దూరం వెళ్లవలసి వచ్చింది. అల్పా హారం కాస్త ఆలస్య మైంది. అంచేత మధ్యాహ్నపూజ ఒకటిన్నరకు కాలేదు. సాయి మహరాజు మంచి మూడ్‌లో ఉన్నారు. నవ్వుతూ కబుర్లు చెప్పారు. అల్పాహారం తరువాత నేను కొద్ది నిముషాల పాటు పడుకొని లేచి, మా వాళ్లతో కలిసి మసీదుకు వెళ్లాను. సాయి మహరాజు ఉత్సాహంగా ఉన్నారు. ఓ కథ చెప్పారు. అక్కడున్న ఒక పండు తీసి చూపుతూ అది ఎన్ని పళ్లను ఉత్పత్తి చేయగలదని అడిగారు. దానిలో ఉన్న గింజలెన్నైతే అన్ని వేల పళ్లు ఇవ్వగల దన్నాను నేను. ఆయన ఆనందంగా నవ్వి, అది దాని సొంత ధర్మాన్ని పాటిస్తుందని చెప్పారు. తమను సేవించి మంచి ప్రగతిని సాధించిన ఒక పవిత్రురాలైన కన్యను గూర్చి చెప్పారు. సూర్యాస్తమయవేళ మాకు ఊదీనిచ్చారు. తరువాత సాయి సాయం విహారానికి వచ్చే సమయంలో ఆయనను చూడటం కోసం చావడికి ఎదురుగా నిలబడ్డాము. ఆయన దర్శనమయ్యాక వెనుదిరిగి మా విడిదికి వచ్చాము. భీష్మ, గోఖలే, భాయి, యువ కుడైన దీక్షిత్‌ల భజనలు వింటూ కూర్చున్నాము. మాధవరావు దేశ్‌పాండే, ఉపాసనీ మొదలైన వారు కూడా ఉన్నారు. ఆ సాయంత్రం ఆనందంగా గడిచింది.

13-12-1911

నేను మామూలు ప్రకారమే లేచాను. స్నానానికి వేడినీళ్లు సిద్ధంగా లేకపోవటంతో బయటికి వచ్చి మాట్లాడుతూ కూర్చున్నాను. బయటికి వెడుతున్న సాయి మహరాజుకు నమస్కరించుకొన్నాను. స్నానానంతరం పంచదశి చదివాను. తరువాత మసీదులో సాయి దర్శనానికి వెళ్లి, హారతి అయ్యేవరకు ఉన్నాను. సాయంత్రం నాలుగు గంటల వేళ బలవంత్, భీష్మ, బంధువులతో కలిసి సాయి మహరాజ్ దగ్గరకు వెళ్లాము. సాయి మహరాజు 'బంధు' తెచ్చిన నా హుక్కా కొంచెం పీల్చారు. మాధవరావు నాకు తిరుగుప్రయాణానికి. అమరావతికి





అనుమతివ్వవలసిందిగా సాయి మహరాజును కోరాడు. మరునాటి ఉదయం చెప్తానన్నారు సాయి. మిగిలిన అందరినీ మసీదు బయటికి పంపివేసాక సాయి తండ్రిలాగా ఎంతో దయతో నాకు ఒక సలహా యిచ్చారు. సూర్యాస్తమయ వేళ మేము సాయిని చావడి దగ్గర దర్శించుకొని, తిరిగి రాత్రి హారతికి వెళ్లాము. తరువాత భీష్మ మామూలు కంటె కాస్త ముందరగా పంచదశి చదివాడు. భాయి కూడా ఒక భజన పాడాడు.

## మౌనదీక్ష

పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు మే నెల 31వ తేదీ నుండి మౌనదీక్ష స్వీకరించారు. అంతకుముందరి సాయంత్రం హఠాత్తుగా ఆశ్రమవాసులు, కొద్దిమంది కార్యకర్తలతో చిన్న సమావేశం ఏర్పరచి యీ విషయాన్ని తెలియజేసారు. అందుచేత ముందుగా అందరికీ తెలియజేయలేకపోయాము. స్వామివారి యీ దీక్ష కనీసం మూడు నెలల పాటు కొనసాగుతుంది. అటుపై భగవదిచ్ఛ! సెప్టెంబరు 7వ తేదీ వరకు స్వామివారి దర్శనం కోసం దయచేసి ఎవ్వరూ తొందరపడి రావద్దని భక్తులందరికీ యిదే మా విన్నపం. ప్రతినెలా శ్రావణ పూర్ణిమనాటి ఉదయం (ఆగస్టు 20) పది గంటల నుండి పదకొంటు గంటల వరకు ఒక గంటసేపు మాత్రం వారి దర్శనానికి అవకాశం ఉంటుంది. అది కూడా మౌనంతోనే.

స్వామివారి సాధన మనందరి శ్రేయస్సు కొరకే ఉపకరిస్తుంది గనుక మనందరం వారి సాధనకు సహకరించే విధంగా - ఏ విధమైన యిబ్బందీ వారికి కలిగించకుందుముగాక! తథాస్తు!

# అదెవరు?



## శ్రీ రమణులు

- "రమణ మహర్షితో సంభాషణములు" నుండి

**భక్తుడు:** ఆత్మ అనుభవగోచరమయ్యే విధంగా నేను అనాత్మను తొలగించుకోవాలనుకొంటున్నాను. ఎలా దీన్ని సాధించగలను? అసలు అనాత్మ లక్షణాలేమిటి?

**రమణులు:** అనాత్మను తొలగించి తీరాలని చెప్తున్న వాడొకడున్నాడు. అతడెవరు?

**భక్తుడు:** ఈ వ్యక్తి (తాను) అని నా అభిప్రాయం. నేను కలకత్తా నుండి మద్రాసుకు వెళ్లాలనుకొంటాను. ప్రయాణంలో మద్రాసు స్టేషన్లో దిగాలంటే అది మద్రాసని తెలియడానికి స్టేషన్ల పేర్లుండే పలకలు, కాల నిర్ణయ పట్టికలు (టైం టేబుల్) ఉండాలి. లేకపోతే నేను నా స్టేషన్లో సరిగా దిగలేను. మరి, నా ఆత్మాన్వేషణలో నాకు దారి చూపేవి ఏవి?

**రమణులు:** ప్రయాణానికి నీ వివరణ బాగానే ఉంది. నీవు మద్రాసు నుండి ఎంత దూరంలో ఉన్నావో నీకు తెలుసు. కానీ ఆత్మకు ఎంత దూరంలో ఉన్నావో చెప్పగలవా?

**భక్తుడు:** నాకు తెలియదు.

**రమణులు:** నీవెప్పుడైనా ఆత్మనుండి విడిపోయి ఉన్నావా? అలా విడిపోయి ఉండటం సాధ్యమా? మిగిలినవన్నీ నీకంటె వేరుగా ఉన్నవి. కానీ, ఆత్మ అత్యంత సన్నిహితం కాదా! ఆత్మను పొందడానికి నువ్వెక్కడికి పోవాలంటావు?

**భక్తుడు:** నేనిపుడు ఆత్మకు దూరంగా ఉన్నాను. దానిని పొందడానికి నా అడుగులు వెనక్కు పడాలి.

**రమణులు:** ఎంత దూరంగా ఉన్నావు? తాను వేరుగా ఉన్నానని అంటున్న వారెవరు? రెండు ఆత్మలు ఉండగలవా?





**భక్తుడు:** ఆభరణాలు బంగారం యొక్క రూపాంతరాలయినట్లే వ్యక్తులు ఆత్మ యొక్క రూపాంతరాలని చెప్తున్నారు.

**రమణులు:** వ్యక్తి ఆభరణాల మూలవస్తువయిన బంగారాన్ని ఉపేక్షించి ఆభరణాల పరిభాషలో మాట్లాడినప్పుడు అవి బంగారమని అతనికి చెప్పాడు. అక్కడ వ్యక్తి చైతన్యమే. కానీ తనను ఆ చైతన్యం యొక్క రూపాంతరమని చెప్తున్నాడు. నిన్ను ఆ చైతన్యము ఒక్క రూపాంతరంగా చెప్పడానికి నీవు ఆత్మకన్నా వేరుగా ఉన్నావా?

**భక్తుడు:** తాను ఒక ఆభరణమైనానని బంగారం చెప్తున్నట్లు ఊహించలేమా?

**రమణులు:** బంగారం జడం. కనుక అలా చెప్పదు. కాని వ్యక్తి చైతన్యవంతుడు. కనుక చైతన్యం కంటే వేరుగా పని చెయ్యలేడు. ఆత్మ శుద్ధ చైతన్యం. అయినప్పటికీ తనంతట తాను "నేను దేహా"న్ని అని చెప్పలేని - జడమైన దేహంతో తాను తాదాత్మ్యం చెందుతున్నాడు. అన్యుడెవడో అలా చెప్తాడు గానీ - అపరిమితమైన ఆత్మ అలా చెప్పదు. మరి, అలా చెప్పేవాడు ఎవరు? శుద్ధ చైతన్యానికీ, జడ శరీరానికీ మధ్య ఒక కృత్రిమమైన 'నేను' ఆవిర్భవించి - తనను శరీర పరిమితంగా భావించుకొంటున్నది. ఆ పిశాచమే అహం కారం లేదా మనస్సు - లేదా వ్యక్తిత్వం.

సమస్త శాస్త్రాలు ఈ పిశాచావిర్భావం మీద ఆధారపడి ఉన్నాయి. దానిని నివారించడమే గమ్యం. అంతకంటే అధికమేమీ కాదు.

**భక్తుడు:** మనస్సు ఆలోచనల మూట అని చెప్పారు గదా!

**రమణులు:** ఏకైక మూలమైన 'అహం' భావన వలన మనస్సు పనిచేస్తోంది.

'మానసంతుకిం మార్గణే కృతే ।
నైవ మానసం మార్గ ఆర్జవాత్ ॥' ఒక ప్రత్యేక విషయంగా మనసుకు వాస్తవమైన ఉనికే లేదు.



# చరిత్ర మఱుగున ...

- శుకవాణి

అశోకచక్రవర్తి తాను చక్రవర్తి పట్టం నిలుపుకోవాలన్న దౌర్బల్యంతో అనేకానేక రాజ్యాలు వశం చేసుకున్నాడు. చివరిగా కళింగ రాజ్యంపై దండెత్తాడు. లక్ష శవాలతో నిండిన రణభూమిలో మరో లక్షమంది ఖైదీలతో కలిసి నిలబడి "ఆహా! గెలిచాను" అనుకున్నాడు. కానీ ఆ యుద్ధ భీభత్సం అతనిలో లోలోపలి మానవత్వాన్ని మేలుకొలిపింది. బుద్ధ ధర్మానుగామిగా మారి తన బాధను తాను ఉపశమింపజేసుకున్నాడు. కానీ, కళింగ మాత్రం క్రుంగిపోయింది. కాలగతిలో ఆ రాజ్యానికి (యింకా సామంతరాజ్యంగానే ఉన్నది) మహా మేఘవాహనుడు రాజైనాడు. వెంటవెంటనే ప్రకృతి భీభత్సాలతో చెరువుల్లో, నదుల్లో ఉప్పనీరు చేరిపోవటంతోను, మంచినీటి కాలువలలో పెద్దపెద్ద రాళ్ల పడటంతోను, గతంలో తమ వలన సాయం పొందిన సాటి రాజులే యిబ్బందులు కలిగించటంతోను ఎన్నెన్నో చికాకులు దేశాన్ని చుట్టుముట్టాయి. అదుగో ఆ సమయంలో రాజపుత్రుడు ఉదయించాడు. అతనికి ఖారవేలుడు అని పేరు పెట్టారు. దానికి అర్థం 'తుఫాను' అని. ఖారవేలుడు తన పదహారేళ్ల వయసులో యౌవరాజ్యాభిషిక్తుడయ్యాడు. తండ్రి మరణానంతరం పాతికేళ్లప్రాయంలో రాజయ్యాడు.

ధ్వంసమైన కోట పునర్నిర్మాణం, ప్రజల క్షేమం కోసం చేపట్టవలసిన అభివృద్ధి కార్యాలు, మగధ (అశోకుని) దండయాత్ర తరువాత సాహసాన్ని, ఆత్మస్థైర్యాన్ని పోగొట్టుకొన్న జాతిలో నూతనోత్తేజం నింపటం, మగధ దేశీయుల చేతిలోకి వెళ్లిపోయిన తమ కళింగ గౌరవచిహ్నాం శీతలనాథుని విగ్రహం తిరిగి తెచ్చి జాతిప్రతిష్ఠ నిలపటం ఇన్ని లక్ష్యాలు ముందుంచుకొని పని ప్రారంభించాడు ఖారవేలుడు. కోట బాగు





చేయించటం, వాగులు, చెరువులు, మంచినీటి కాలువలు శుభ్రం చేయించటం, తోటల పెంపకం-యీ పనులన్నీ ఎంతో శ్రద్ధగా పూర్తి చేయించాడు. కానీ, ప్రజల మీద పన్నులభారం పెంచలేదు. ఇది ప్రజల్లో అతని పట్ల నమ్మకాన్నీ, కృతజ్ఞతనూ కూడా పెంచింది.

శాతకర్ణి మహారాజు కళింగకు పశ్చిమాన, తూర్పున కూడా రాజ్యాన్ని విస్తరింపజేసుకొని బలపడి ఉన్న మహావీరుడు. తన ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచటం కోసం తాను ఏదో ఒక రాజ్యం గెలవాలనుకొని, శాతకర్ణి ఆధిపత్యంలో ఉన్న ఋషిక నగరాన్ని ఆక్రమించుకొన్నాడు ఖారవేలుడు. అనేక సంవత్సరాల తరువాత తమ రాజ్యంలో జరిగిన విజయోత్సవాలు ప్రజల్లో ఆనందాన్నీ, ఆత్మగౌరవాన్నీ కూడా కలిగించాయి. శాతకర్ణి వంటి మహావీరుడిని జయించగలిగామన్న ఠీవి ప్రజల్లో నిండింది. యువకులెందరో స్వచ్ఛందంగా యుద్ధసైన్యంలో చేరడానికి ముందుకు వచ్చారు. సైన్యం బలపడింది అలా. అంతలో భోజకుడు, రథికుడు అనే యిద్దరు సర్దారులు కళింగలోని విద్యాధరాధివాస్‌పై దండెత్తారని తెలిసి, ఖారవేలుడు వారిని అణచివేసాడు. వాళ్లు క్షమించమని వేడుకోగా ఉదారంగా విడిచిపెట్టాడు. తన ప్రజాక్షేమం కోసం చేసిన పనులతో ఖజానా ఖాళీ అయిపోయి ఉన్నది. ఇప్పుడు వీళ్లను జయించటం వలన వచ్చిన సంపదతో తిరిగి దాన్ని నింపాడు ఖారవేలుడు. క్రమంగా మిగిలిన రాజ్యాలు కళింగను గౌరవంతో చూడసాగాయి. అలా అలా ఏడేళ్లు గడిచిపోయాయి.

ఖారవేలునిలో తన జాతి గౌరవచిహ్నమైన శీతలనాథ జైనుడి విగ్రహం వెనక్కు తెచ్చితీరాలన్న పట్టుదల బాగా పెరిగింది. తన ప్రజలతోను, హితవరులతోను సంప్రదించి, వారిని ఉత్తేజితులను చేసాడు. ఆ విగ్రహం కోసం కడపటి రక్తపుచుక్క వరకు ధారపోయడానికి సంసిద్ధులయ్యారు సైనికులంతా. మగధ రాజధానీ నగరాన్ని దానికి దక్షిణాన ఉన్న గోరథగిరి

అనే కోట రక్షిస్తోంది. ఇది పెద్ద గిరిదుర్గం, చాలా బలిష్ఠమైనదీను. దీనిని గెలిస్తే రాజధానిని తేలికగానే గెలవవచ్చు. కానీ గోరథగిరి గెలవడమే చాలా కష్టం. అయినా సరే- దృఢదీక్షతో, గట్టి ప్రణాళికతో ఖారవేలుని సైన్యం కోట మీదికి సాగింది. రాజధానికి నాలుగువైపులా చుట్టుముట్టే ఏర్పాటు చేసారు. సరిగ్గా-ఆ సమయంలోనే ఖారవేలుని వ్యక్తిత్వానికి పెద్ద పరీక్ష ఎదురైంది. గ్రీకురాజు డిమిట్రియస్ అనేవాడు పెద్ద సైన్యం తీసుకొని మగధ మీద దండయాత్రకు వస్తున్నాడన్న వేగుల వారి వార్త అతనికి చేరింది. ఖారవేలుడు ఆలోచనలో పడ్డాడు. అటు డిమిట్రియస్ దాడితో మగధ చితికిపోతుంది. తాను సులభంగా జయించవచ్చు అతనితో చేతులు కలిపితే మగధను ఎలాగైనా ఓడించి తీరవచ్చు. కానీ, ........

“వచ్చినవాడు పరదేశస్థుడు. అతనొక దోపిడీదారు. మన దేశాన్ని దోచుకోవడానికి వచ్చిన దొంగ. అతనితో చేతులు కలిపి నా దేశీయుడు- నాకు శత్రువైనా సరే - నా సాటి రాజైన మగధ రాజును నాశనం చేయటం తప్పు. మన ప్రజల పట్ల స్వదేశీయ సైనికులకున్న కరుణ, అభిమానం, విదేశీయ సైనికులకు సహజంగానే ఉండవు. మగధ ప్రజలను విదేశీయులకు బలి చేయటం తప్పు. నేను మగధను తరువాతెప్పుడైనా జయించవచ్చు. ఇప్పుడు మాత్రం యీ పరాయివాడి పని పట్టాలి” - ఇలా ఆలోచించిన ఖారవేలుడు తన సైన్యాన్ని డిమిట్రియస్ సేన మీదికి నడిపాడు. ఈ వార్త డిమిట్రియస్‌కు చేరింది. తానొకవైపు, ఖారవేలుడింకొకవైపు నొక్కేసి మగధను కొల్లగొట్టవచ్చుననీ, ఆ తరువాత చెరి సగం పంచుకోవచ్చుననీ ఆశతో వచ్చాడు అతడు ఆ సమయంలో. ఖారవేలుడు ఎంతటి వీరుడో- అంతటి దేశాభిమాని కూడా అని అతడు గ్రహించలేకపోయాడు. అతడు తన మీదికే రావటం అన్న ఊహించని పరిణామానికి దిమ్మెరపోయాడు. తన సైన్యాన్ని వృథాగా బలిచేసుకోవటం యిష్టంలేక డిమిట్రియస్ వెనక్కు





తిరిగి పారిపోయాడు. విజయోత్సాహంతో తిరిగి వచ్చిన ఖారవేలుడు బ్రాహ్మణులకు చక్కని బహుమతులిచ్చి, ఇళ్లు కట్టించి యిచ్చాడు. తాను జైనమతస్థుడైనా వైదిక మతాన్ని ఆయన నిరాదరించలేదు.

ప్రాచీనదికి రెండువైపులా క్రొత్త కళింగ రాజధానీ నగర నిర్మాణం చేసి, ఖారవేలుడు తన విజయాలకు చిహ్నంగా తన నూతన రాజభవనానికి “మహా విజయం” అని పేరు పెట్టాడు. ప్రజలు ఆయనను “మహా విజేత” అని సగౌరవంగా పిలుచుకోసాగారు. మరికొన్నేళ్లు గడిచాయి. కళింగకు వ్యతిరేకులైన రాజులంతా కలిసి కళింగపై దండెత్తాలనుకొన్నారు. ఖారవేలుడు ఉత్తర దిగ్విజయ యాత్రకు వెళ్లిన అదును చూచి వీళ్లంతా కళింగను ముట్టడించాలనుకొని, పితుండ అనే దుర్గాన్ని స్థావరంగా చేసుకొని వేచి ఉన్నారు. అది తెలిసిన ఖారవేలుడు మెరుపువేగంతో వెనుదిరిగి వచ్చి పితుండ దుర్గం పైబడి దుర్గాన్నీ, లోపలున్న వారినందరినీ కూడా ఛిన్నాభిన్నం చేసాడు. ఆయా రాజులు తమ రాజధానులు విడిచి పారిపోయేదాకా తరిమికొట్టాడు కూడా.

అటుపైన ఖారవేలుడు తన చిరకాల వాంఛ అయిన శీతలనాథ జైన విగ్రహాన్ని తిరిగి తెచ్చుకోవడానికి మగధ మీదికి సాగాడు. మగధ ప్రజలకు ఈ విషయం తెలిసింది. భారతదేశాన్ని దోచుకోవడానికి వచ్చిన డి మిట్రియస్‌ను పారదోలినప్పటినుండీ ఖారవేలునిపై గౌరవం హెచ్చింది అందరికీ. అతని శౌర్యం పట్ల భయమూ పెరిగింది. మగధ ప్రభువూ, ప్రజలూ కలిసి ఆలోచించుకొన్నారు కర్తవ్యం. ప్రభువు బృహస్పతి మిత్రుడు ఖారవేలుని చెంతకు వచ్చాడు. తన భావన ఆయన ముందుపరిచాడు. తమ రెండు రాజ్యాలు చిరకాలంగా వైరభావంతో ఉండటానికి మూలకారణం గతంలో జరిగిన మహాయుద్ధమేనని అంగీకరించాడు. ఎన్నటిదో దోషానికి రెండు రాజ్యాల ప్రజలూ కూడా యిలా యుద్ధాల ద్వారా యిక్కట్లు పడవలసి

రావటం బాధాకరంగా ఉన్నదన్నాడు. కళింగుల నుండీ మగధ దోచుకొన్న శీతలనాథ జైనుని విగ్రహాన్ని తిరిగి యిచ్చేస్తామనీ, ఇకపై యిరురాజ్యాలూ మైత్రితో కలిసి ఉండటం మంచిదనీ అన్నాడు. ఖారవేలుని వీరత్వంలో ఉద్ధతి లేదు. ఔదార్యం ఉంది. అందుచేత ఆయన బృహస్పతి మిత్రుని ప్రతిపాదనను అంగీకరించాడు. విగ్రహం కళింగకు అందటంతో వైరం ఆరిపోయి, స్నేహం అంకురించింది.

కళింగ రాజ్యంలో అత్యద్భుతమైన దేవాలయ నిర్మాణం జరిగింది. శీతల నాథ జైనుని విగ్రహం శాస్త్రోక్తంగా ప్రతిష్ఠితమైంది అందులో. ఖారవేలుడు కన్యాకుమారి పర్వతం మీద మహాపరిషత్ ఒకటి ఏర్పాటు చేసి, అక్కడికి వచ్చిన మూడున్నర వేలమంది జైన సన్యాసులందరికీ చక్కని సత్కారాలు చేయటమేకాక, ఒక పెద్ద ఆశ్రమం కూడా నిర్మించి, ధార్మిక గ్రంథాల రచనకు అన్ని ఏర్పాట్లు చేసాడు. ఇతర మతాలను కూడా సమంగా ఆదరిస్తూ పరిపాలించాడు.

ఆ విధంగా ఖారవేల చక్రవర్తి ఒక గాయపడిన పక్షిలాగా అతి దుర్బల స్థితిలో ఉండి, ఆత్మధృతిని కోల్పోయి, ప్రకృతి వైపరీత్యాలతో చితికిపోయి ఉన్న ఒక జాతిని తన దీక్షతో, దక్షత (సమర్థత)తో, నిరంతర పరిశ్రమతో తిరిగి ఉన్నత స్థానానికి తెచ్చి నిలిపాడు. అంతే కాదు - వ్యక్తిగత విజయం కోసం దేశ గౌరవాన్ని బలిపెట్టరాదనీ, విదేశీ శక్తులను పొరపాటున కూడా దేశంలోకి చొరనివ్వరాదనీ వివేకంతో దూరాలోచన చేసిన త్యాగశీలి ఖారవేలుడు. ఆయన జీవించింది ఎన్నడో 2200 సంవత్సరాల క్రిందట. అయినా చరిత్రలో ఆయన పేరు మాసిపోదు. కానీ, యిటువంటి మహనీయుల గాథలు మన పిల్లల చరిత్ర పుస్తకాల్లకిగానీ, మన రాజకీయ నాయకుల మస్తిష్కాలలోకిగానీ ఎక్కకపోవటం మన దౌర్భాగ్యం!





# ఒక విదేశీయుని అంతరంగావిష్కరణ

**- డేవిడ్ ఫ్రాలే (అమెరికన్)**

ఆధ్యాత్మిక విజ్ఞానం ఆవిర్భవించడానికి సంస్కృతి ఒక అడ్డంకి కానట్లే ఆ విజ్ఞానపు ప్రచారానికి కూడా అది అడ్డంకి కాబోదు. భారతీయ సంస్కృతిలో దాచవలసిందిగాని సిగ్గుపడవలసిందిగానీ ఏమీ లేదు. అది పాశ్చాత్య సంస్కృతి కంటే న్యూనమైనదైతే గదా సిగ్గుపడాలి? కాని అది పాశ్చాత్య సంస్కృతి కంటె చాలా గొప్పది. పాశ్చాత్య సంస్కృతిని సముద్ధరించ గల సామర్థ్యం దానిలో ఉంది. సాంకేతిక శాస్త్రంలో పశ్చిమ దేశాలతో పోల్చినపుడు దానిలో లోపం ఉంటే ఉండవచ్చు గాక; ఆధ్యాత్మిక, తాత్త్విక, సౌందర్యారాధన క్షేత్రాలలో చూస్తే పాశ్చాత్య సంస్కృతిని హిందూ సంస్కృతిని అధిగమించిందని చెప్పవచ్చు.

కొందరికి "హిందూ సంస్కృతి" అనే పదం గిట్టదు. దానికంటే బాగా వాడుకలో ఉన్న "భారతీయ సంస్కృతి" అనే పదం ప్రయోగించటం మంచిదనుకుంటారు. వారి దృష్టిలో "హిందూ" పదం ఒక మతానికి పరిమితమైనది కాగా "భారతీయ" అనే పదం ఉపఖండంలోని వైవిధ్య భరితమైన సంస్కృతిని సూచించటానికి మరింత అనువుగా ఉంటుందని వారు అనుకుంటారు. కాని భారతదేశపు సంస్కృతి ప్రాథమికంగా హిందూత్వానికి, సంస్కృత భాషకు సంబంధించిన సంస్కృతియే. ఒక్క హిందూమతం వారే కాదు బౌద్ధులు, జైనులు, సిక్కులు, కొంతమేరకు భారతీయ ముస్లింలు, క్రైస్తవులు సహితం ఆ హైందవ, గీర్వాణ సంస్కృతినే అనుసరిస్తూ వచ్చారు.

భారతదేశపు సంగీతం హిందుస్తానీ. ప్రాచీనకాలపు సామవేదం మొదలుగా గల హిందూ, సంస్కృత గ్రంథాలే మూలంగా యిది ఏర్పడింది. హిందూ దేవాలయాలలో జరిగే నృత్యాల నుంచే భారతదేశ నృత్యం రూపొందింది. భారతీయుల వైద్యవిధానమైన ఆయుర్వేదం, వారి

జ్యోతిష్యశాస్త్రం వేదాల చుట్టూ అల్లుకున్నవే, హఠయోగ వ్యాయామ విధానం హిందూ మత సాధనల సంప్రదాయంలోనిదే. వారి సాహిత్యము, తత్త్వశాస్త్రము, వేదభాషయైన సంస్కృతంలోనే ప్రారంభమైనాయి. ఐరోపీయ సంస్కృతిలో క్రైస్తవం ఎంతగా వ్యాపించిందో అంతకంటే చాలా ఎక్కువగానే భారతీయ సంస్కృతి యొక్క అన్ని రంగాలలోను హిందూ మతం యొక్క భావన, దాని రూపాలు అవిభాజ్యంగా అల్లుకుపోయాయి. క్రైస్తవమతం కంటే క్రీస్తు పూర్వపు గ్రీకు, రోమన్ సంస్కృతి ప్రభావం, క్రీస్తు తదుపరి పాశ్చాత్య మేధావుల ప్రభావం ఐరోపీయ సంస్కృతిలో విశేషంగా ఉన్నాయి.

దురదృష్టవశాత్తు చాలామంది ఆధునిక హిందువులు పై మెరుగులు చూసి మోజుపడి, ఆధ్యాత్మికత లోపించిన పాశ్చాత్య ఆలోచనా విధానాన్ని, తీరుతెన్నులను అనుకరిస్తూ పాశ్చాత్య సంస్కృతిని స్వీకరించటానికి తహ తహలాడుతున్నారు. దీనివల్ల ఒక్క భారతదేశానికేగాక-సమస్త ప్రపంచానికీ తీరని నష్టం వాటిల్లుతున్నది. రాజకీయ వ్యవహారాల గురించి, సర్వ సామాన్యమైన మానవ భావావేశాల గురించి బాహ్యమైన అవగాహనతో వ్రాస్తూ ప్రచార సాధనాల ద్వారా ఆలోచనలు పెంపొందిస్తున్నవారు ప్రపంచంలో కావలసినంత మంది ఉన్నారు. పాశ్చాత్య తత్త్వ శాస్త్రాన్ని, కళా రంగాన్ని అధ్యయనం చేస్తున్న విద్యార్థులు యిప్పటికే కావలసినంతమంది ఉన్నారు. విద్యావంతులైన హిందువులకు షేక్స్పియర్ అయితే తెలుసు. కాని ఎవరి విశ్వచైతన్య జ్ఞానం ముందు షేక్స్పియర్ మాత్రమేగాక ఐన్స్టీన్ కూడా వెలవెలబోతాడో-అట్టి కాళిదాసు, భర్తృహరిలవంటి భారతీయ మహాకవుల దివ్యసత్యపు ప్రత్యక్షానుభూతి నొందిన ఆధ్యాత్మిక ధీరాగ్రేసరుల గురించి వారిలో ఎంతమందికి తెలుసు? ఇంగ్లండులోనూ, ఇంగ్లీషు మాట్లాడే యితర దేశాలలోనూ షేక్స్పియర్ మహోత్సవాలు ఎంత వైభవంగా జరుపుతారో అదే విధంగా భారతదేశంలో కాళిదాస మహోత్సవాలు ఎందుకు నిర్వహించరు?

భారతీయ సంస్కృతిలో పాశ్చాత్య మేధావులను మించిన మహ





నీయులు ఉండి. ప్రపంచమంతా వారిని నిర్లక్ష్యం చేస్తుండగా - భారతీయ యువజనులు తమ అధ్యయనాలను పాశ్చాత్య మేధావుల మీదనే కేంద్రీకరించటం దేనికి? మార్క్స్, కాంట్, ఫ్రాయిడ్‌ల వంటి మేధావులనే వారు ఆదర్శంగా తీసుకోవటం దేనికి? ఈ పాశ్చాత్య మేధావుల మనస్సుల నంతటినీ అంతకంటే బృహత్తరంగా విస్తరించి ఉన్న తమ అంతశ్చైతన్యంలో ఒక మూలకు నెట్టి వేయగల మహనీయులు శంకరాచార్యుల నుంచి అరవిందుల వరకు ఎందరో లేరా? ఏయే రూపాలలో సంస్కృతి వెల్లడవు తుందో ఆ ప్రతి ఒక్కరూపంలో ఆత్మ యొక్క వైభవాన్ని వ్యక్తీకరించటంలోనే భారతదేశపు విశిష్టస్థానం ఉంది. భారతదేశం తన మహత్తరమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించుకోవటం మాత్రమేగాక, దానికి క్రొత్త మెరుగులు చేస్తూ విస్తరింపజేస్తూ, మిగిలిన ప్రపంచదేశాలు కూడా దాని నుంచి ప్రయోజనం పొందేలా చెయ్యాలి. దీనికోసం హిందువులు తమ హిందూ సంస్కృతిని జాతీయ సంస్కృతి యొక్క రూపంగా కాక, విశ్వ సంస్కృతి యొక్క రూపంగా తెలుసుకొని దానిపట్ల అంకితభావాన్ని ప్రదర్శించాలి. అలా చేయాలంటే హిందువులు తమ సంస్కృతి ఏమిటో ప్రపంచానికి చాటే సంసిద్ధత కలిగి ఉండాలి. ఏదో సాంస్కృతిక ప్రచారోద్యమంగా కాక హృదయంతో యిచ్చిన ప్రేమ కానుక కావాలి యిది. అయితే హిందువులు కంప్యూటర్లు, యితర సాంకేతికపర ప్రసారాలను వినియోగించగూడదని దీని అర్థం కాదు. వాటినన్నింటిని తమదైన ఆధ్యాత్మిక సంస్కృతీ వికాసానికే వినియోగించుకోవాలి తప్ప - అట్టి పరాకాష్ఠనందుకోలేకపోయిన పాశ్చాత్య నాగరికతను స్వీకరించ టానికి మాత్రం కాదు.

ఈనాడు యథార్థమైన సంస్కృతి ప్రపంచంలో ఎక్కడా కాగడాపెట్టి వెతికినా కనిపించటం లేదు. ఛాందసవాద మతం కర్కశమైన పట్టు బిగించిన చోట్ల మినహాయిస్తే ప్రతి దేశంలోను ఆధునిక పాప్ వినియోగ సంస్కృతి విస్తరించిపోతున్నది. చాలా దశాబ్దాలుగా పాశ్చాత్యుల మేధా పరమైన, కళాత్మకమైన సంస్కృతి క్రమేపీ క్షీణిస్తున్నది. అయితే ఈ

సాంస్కృతిక శూన్యం (cultural vaccum) ఒక గొప్ప అవకాశం. భారతదేశపు సంస్కృతి వంటి ఆధ్యాత్మిక సంస్కృతి ఈ శూన్యాన్ని ఆక్రమించే అవకాశముంది. కాని, యిది జరగాలంటే హిందువులు కళ్ళు తెరచి, తమ జీవనకార్యం గుర్తెరిగి, తమ సాంప్రదాయపు విశ్వజనీన ప్రాధాన్యతను తెలుసుకొని మసులుకోవాలి. రానున్న శతాబ్దంలో అత్యంత ప్రాముఖ్యత సంతరించు కోనున్న మహాకార్యమిది. నాబోటి పాశ్చాత్యులు హిందూ సంస్కృతిని అభిమానించటం మొదలుపెట్టారంటే యిది జగన్మాత కృపయే అనవచ్చు, బహుశా హిందువులు కూడా ఆ తల్లి కృప వలన స్వీయ వారసత్వపు విలువను గుర్తించటం మొదలుపెడతారని, దానిని మరల సృజనాత్మకతతో సర్వజన శ్రేయస్సు నిమిత్తం వినియోగిస్తారని ఆశిద్దాం.

## కర్మలో ధర్మం

**- మాతా కృష్ణాబాయి**

మనం యిక్కడ - అంటే ఆశ్రమంలో ఏ విధమైన సేవ చేసినా అది మన ప్రియతముడైన గురువుకు చేస్తున్న సేవగానే మనం భావించాలి. అది ఎంత చిన్న పనైనా సరే - ఉదాహరణకు భక్తులు కూర్చోవడానికి చిరుచాపల వంటివి (ఆస్తరణలు) పరవటమైనా సరే- అత్యంత భక్తి శ్రద్ధలతో చెయ్యాలి. ఎవరైనా ఒక వస్తువు నీ చేతికి ఆదరంగా అందించకుండా నీ మీదికి విసిరేస్తే ఎలా భావిస్తావు? ఎంత బాధపడతావు? అలాగే మనం మర్యాదగా పరిచే బదులు ఆస్తరణాలన్నీ ఓ గుట్టలాగా నేల మీద విసిరేస్తే - మనం స్వయంగా పాపా (గురువు) మీదికి విసిరినట్లే అని తెలుసుకోండి. అలాకాకుండా ఒక్కొక్కదాన్నీ శ్రద్ధతో, ప్రేమతో - అదంతా గురుసేవేనన్న భావనతో చెయ్యాలి. గుర్తుంచుకోండి- ఆశ్రమంలో మనం చేసే ప్రతి పనీ గురుస్మరణతో గురుపూజే చేస్తున్నామన్న నిర్మల భావనతో చేయాలి.





## ఏకదృష్టి

**- మాతాజీ (స్వామి రామా కథ ఆధారంగా)**

అనగనగా ఒక రాజుగారు. ఆయన దగ్గర ఒక విశ్వాసపాత్రుడైన సేవకుడుండేవాడు. ఆయన తన నిరంతర సేవలతోను, నిజాయితీతోను రాజు మనసును చూరగొన్నాడు. క్రమక్రమంగా మంత్రివర్గంలో చోటు చేసుకోవటమే గాదు - ముఖ్యమంత్రి స్థాయికి పెరిగాడు. తమకు నాలుగు మెట్లు క్రింద నిలవవలసిన సేవకుడు తమకే ముఖ్యమంత్రిగా నిలవడాన్ని మిగిలిన మంత్రులు, ఉద్యోగులు జీర్ణించుకోలేకపోయారు. వారిలో పెరుగుతున్న అసహనాన్నీ, అసూయనూ గ్రహించారు రాజుగారు. అక్కడికి ఐదారుమైళ్ల దూరంలో ఉన్న ఒక పెద్ద ఉద్యానవనంలో, రాజోద్యోగులందరికీ ఒక సమావేశం ఏర్పాటు చేస్తున్నామనీ ఫలానా తేదీన సాయంత్రం ఫలానా సమయానికి అక్కడికి రావాలనీ చాటింపు వేయించారు. రాజుగారు స్వయంగా సమావేశానికి వంచేస్తారని కూడా ప్రకటించారు.

అనుకొన్న రోజున ఆ స్థలానికి వెళ్లడానికి రాజోద్యోగులందరూ బయలుదేరారు. అంతకుముందెప్పుడూ ఆ త్రోవలో లేని రకరకాల పందిళ్లూ, గుడారాలూ కన్పించాయి వారికి. ప్రతి దానిలోనూ ఆనందోత్సాహాలతో నాట్యాలు, నాటక ప్రదర్శనలు, కోలాటం వంటి కళా ప్రదర్శనలు గారడీలు, ఉచితంగా విందు భోజనాలు, సంగీత సమ్మేళనాలూ- ఓహ్! కళ్లు తిరిగిపోయేన్ని వింతలు, విడ్డూరాలూ కన్పించాయి. ఈ క్రొత్త విశేషాలన్నీ చూస్తూ, ఆనందిస్తూ, పాల్గొంటూ ఉద్యోగులంతా మెల్లమెల్లగా సాగారు.

ముఖ్యమంత్రి కూడా వాళ్లతోపాటే బయలుదేరాడు. త్రోవకు ఇరువైపుల కొలువుదీరి ఉన్న విచిత్రాలన్నీ గమనించాడు. కానీ, వాటి జోలికి వెళ్లకుండా

తిన్నగా నడుస్తూ వెళ్లిపోయాడు. సరిగ్గా చేరుకోవలసిన సమయానికి రాజుగారి దగ్గరకు చేరుకొన్నాడు. మిగిలిన వారంతా ఎంతో కొంత ఆలస్యంగా వచ్చి చేరారు. మహారాజు సభ్యులందరినీ ఉద్దేశించి యిలా అన్నారు - "మీరందరూ దాదాపు ఒకే సమయానికి బయలుదేరారు. కానీ ముఖ్యమంత్రి ఒక్కడే సరైన వేళకు వచ్చాడు. ఆయన పట్ల మీ భావాలు నేను గమనించాను. ఆయన ప్రత్యేకత ఏమిటో మీకు చెప్పడానికే యిలా చేసాను".

మనం, మన సాధన ఏ తీరున పోతున్నామో తెలుసుకోవడానికి యీ కథ ఎంతో ఉపకరిస్తుంది. భగవంతుడు ఇందులోని మహారాజు. ఆది నుంచీ భగవంతుని పట్ల శ్రద్ధాసక్తులతో ప్రేమించినవాడు ఆయన ఆదేశాల ప్రకారమే నడుస్తాడు. తన భక్తికి మెచ్చి ఆయన తనను ఉత్తమస్థానంలో చేర్చుకొంటున్న కొద్దీ యితని భక్తి పెరుగుతుందేగానీ తగ్గదు. క్రమక్రమంగా భగవంతుడు తప్ప మరేదీ అక్కర్లేదనుకొనేంత గాఢత అతనిలో ఏర్పడుతుంది. అలాంటి పరమభక్తుడే యిందులోని ముఖ్యమంత్రి. ఇక సామాన్య భక్తులు మాటిమాటికీ విషయవాసనలకు లోనవుతూ లంపటాలలో చిక్కుకొంటూ ఉంటారు. తమ గమ్యాన్ని మరచిపోయి కనిపించినవన్నీ కావాలనుకొంటూ - తమ జీవితకాలం పరిమితమేనని గుర్తుంచుకోరు. అది పూర్తి అయ్యేలోపున స్వామిని చేరుకోగల యోగ్యత సంపాదించాలన్న విషయమే మర్చిపోతారు. ఎప్పడో గుర్తు వచ్చినా కాస్త దూరం నడిచి, మళ్లీ ఏదో జాలంలో చిక్కుకుపోతుంటారు. తీరా వేళ మీరిపోయాక చింతిస్తారు. ఏకదృష్టితో, ఏకాగ్రతతో ప్రక్క చూపు లేకుండా నడిచే వారికే భగవత్ప్రాప్తి అన్న విషయం సుస్పష్టం.





# నిదానించు

- జి. సుశీల

చీకటిని చూచి భయపడకు
చీకటి తరువాత వచ్చేది వెలుగే
కష్టాన్ని చూసి వెఱవకు
సుఖాలు వెన్నంటే ఉంటాయి
మొదటి మెట్టెక్కితేనే
పై మెట్టుకు చేరేది
లేనివి ఊహించుకొని
ఉన్న వాటిని జారవిడుచుకోకు -
క్షణక్షణం ఆనందించు,
మరుక్షణం ఏమౌనో తెలియదు.
భగవంతుడి సృష్టిలో ప్రతిదీ విలువైనదే.
తెలుసుకొని జీవితాన్ని జీవించు
పరుగులెత్తి అలసిపోకు
నిదానమే ప్రధానము.

# ఈ నెల బాలగేయం

- సాయిసుధీర

పెసరట్టూ పెసరట్టూ ఉప్మాతో జతపెట్టు
పెసరట్టు తమ్ముడు బొబ్బట్టు, నేతితో అది జతకట్టు
ఒకటి రెంటితో సరిపెట్టు, లేకుంటే పొట్ట గగ్గోలుపెట్టు.

బాలవాణి

# గెలుపు

- మాతాజీ (జాతక కథలు ఆధారంగా)

ఒకసారి బుద్ధుడు ఒక జింక రూపంలో నందియుడు అనే పేరుతో జన్మించాడు. చాలా చక్కని కనులు, పొందికైన శరీరం, వంపులు తిరిగి ఎంతో బలంగా పెరిగిన కొమ్ములు, సాత్వికమైన ప్రవర్తన-ఆ జింక అందరికీ ఎంతో ప్రియతముడైన నాయకుడిగా రూపొందింది. అది ఉన్న అడవికి ప్రభువు శౌర్యతేజుడు. ఆయనకు వేట అంటే తగని మక్కువ. రాజకార్యాలలో నుండీ వీలు చిక్కినప్పుడల్లా ఆయన అడవిలోకి వచ్చి అన్నిరకాల మృగాలనూ వేటాడుతుండేవాడు. మన జింక మాత్రం ఎప్పుడూ అతని కంటబడలేదు. అలా చాలాకాలం గడిచింది.

నందియుడు వృద్ధుడైపోయాడు. కానీ, అతనిలోని శక్తి, వేగం మాత్రం తగ్గలేదు. ఒకరోజు అతను తన జాతి వారందరితోనూ కాస్సేపు మంచి మంచి విషయాలు చర్చించి, మధ్యాహ్నమవుతున్నది-కాస్త విశ్రాంతి తీసుకోవాలనుకొని తన నివాసానికి సాగాడు. ఎండ కాస్త ఎక్కువగా ఉండటం వలన మెల్లగా నడుస్తున్నాడు. శౌర్యతేజుని కంటపడనే పడ్డాడతడు. వెంటనే రాజు విల్లు ఎక్కుపెట్టాడతనివైపు. అనుభవంతో తలపండిన నందియుడు ఓరకంటనే అది గమనించాడు. చెంగున ముందుకురికాడు. రాజు ఎక్కుపెట్టిన వింటితోనే జింక వెనుక పరుగిడ సాగాడు. నందియుడు శరవేగంతో దూసుకుపోతున్నాడు. రాజు గురికి అతను అందటం లేదు. అలా చాలాసేపు పరుగెత్తిన నందియునికి త్రోవలో ఒక నీటిమడుగు అడ్డమైంది. సహజంగా పక్షులకు, జంతువులకు చూపు తీక్షణంగా ఉంటుంది. అందుచేత నందియుడు తనకెదురైనది ఉత్తి నీటి మడుగు కాదనీ, ఊబి అనీ గ్రహించాడు. పొరపాటున అందులో అడుగు





పెడితే యిక అడుక్కి వెళ్లిపోవటమేగానీ పైకి రావటమంటూ జరగదు. పైకి కొద్దిగా నీళ్లు కనిపించినా-దాని లోపలంతా మెత్తని బురద ఉంటుంది. అది లోపలికి లాగేస్తుంది. అందుచేత నందియుడు తన శక్తినంతటినీ కూడగట్టుకొని ఒక్క ఉదుటున ఆ ఊబి మీదుగా చెంగున ఎగిరి అవతలి ఒడ్డుకు చేరుకున్నాడు. కానీ అమితవేగంతో వస్తున్న రాజు ఆ ఊబిని గమనించటం కాస్త ఆలస్యమైంది. రాజు ఊబిలో కూరుకుపోయాడు. 'అయ్యో!' అని కేకపెట్టాడు.

రాజుకు అందకుండా పారిపోతున్న నందియుని చెవిలో ఆ ఆర్తనాదం పడింది. వెంటనే అతడు ఆగి, వెనక్కు చూచాడు. బురదలో కొట్టుమిట్టాడు తున్న రాజు ఆయన కంటబడ్డాడు. నందియుడు పరుగున ఊబి ఒడ్డుకు వెళ్లాడు.

"ఆగండి మహారాజా, మీరు కదిలేకొద్దీ లోపలికి దిగిపోతారు. నేనీ అంచున నిలబడతాను. నా కొమ్ములు గట్టిగా పట్టుకొని ఉండండి. నేను మిమ్మల్ని పైకి లాగుతాను" అన్నాడు. రాజు ఒక్క క్షణం అపనమ్మకంతో నందియునివైపు చూచాడు. అతను తలవంచి కొమ్ములు రాజుకు అందేలాగా నిలబడ్డాడు. రాజు మరి ఆలోచించకుండా ఆ కొమ్ములు గట్టిగా పట్టుకొన్నాడు. నందియుడు మెల్లమెల్లగా ఒక్కొక్క అడుగూ వెనక్కు వస్తూ, తన యావచ్ఛక్తినీ, అనుభవజ్ఞానాన్నీ కూడా ఉపయోగించి రాజును బయటకు లాగాడు. అతను ఒళ్లు తుడుచుకోవడం కోసం పచ్చిక తెచ్చి ముందుపడేసింది.

రాజు కాస్త సిగ్గుపడుతూ "నేను నిన్ను చంపడానికి వచ్చాను. కానీ నువ్వు నా ప్రాణాలు కాపాడావు ఎందుకని?" అని అడిగాడు. నందియుడు మెల్లగా నవ్వాడు.

'మహారాజా, మనం సృష్టించలేనిదాన్ని మనం ధ్వంసం చెయ్య కూడదు. మనం జీవులం. భగవంతుడు ప్రసాదించిన జీవాన్ని తీసే హక్కు

మనకు లేదు. జీవం పొయ్యలేం గదా మరి! పైగా-సాటిజీవిని ప్రాణాపాయ స్థితిలో వదిలి నా ప్రాణం నేను రక్షించుకోవటం మహాపాపం, అధర్మం. అదీగాక మీరు మహారాజులు. రాజ్యాన్ని పాలించి, ప్రజలను రక్షించవలసిన వారు. చూస్తూ చూస్తూ మీ ప్రాణాలను నిర్లక్ష్యంగా ఎలా వదలగలను!" అన్నాడు నందియుడు. రాజు శిరస్సు వంచి నమస్కరించాడు నందియునికి. "నీవు మామూలు జింకవు కావు. ఈ రూపంలో ఉన్న ఎవరో మహాపురుషుడివి. ఇకపై నేను జీవహింస చేయను. నన్ను ఆశీర్వదించు" అన్నాడు. నందియుడు చిరునవ్వుతో యిలా అన్నాడు- "మహారాజా! మీరు ప్రభువులు. ప్రభువైన వానికి కరుణతోపాటు కాఠిన్యమూ తప్పదు. వృథాగా జంతువులను చంపాలన్న ఉత్సాహం మాత్రం మానండి. దుష్టశిక్షణ కోసం కొంత కఠినత్వం ఎటూ చూపవలసే వస్తుంది గదా!"

మహారాజు వినమ్రతతో, "నేను నిన్ను జయించి బంధింపలేక పోయాను. కానీ, నీవు నీ వివేకంతో, ప్రేమతో నన్ను గెలిచావు. మరి, సెలవు తీసుకుంటాను" అని చెప్పి వెనుదిరిగి వెళ్లిపోయాడు. నందియుడు ఒక చెట్టు నీడన విశ్రాంతికై ఒరిగాడు.

## శ్రీ రామకృష్ణ ఉవాచ

తేనెటీగ జోరీగ అని రెండురకాల ఈగలున్నాయి. తేనెటీగ తేనె మాత్రమే తాగుతుంది. జోరీగ కూడా తేనెను పీలుస్తుంది. కానీ, సందు దొరికినప్పడల్లా అంతకంటె ఎక్కువ తమకంతో రసిగానే పుండ్ల మీద కూడా వాలుతుంది. మనుష్యులు కూడా యింతే. భగవద్భక్తులు భగవంతుణ్ణి గురించే తప్ప-యితర విషయాలు మాట్లాడటానికి ఇష్టపడరు. ఇక సంసారమోహితులైన మనుష్యులయితే మాత్రం ఐహిక విషయాల సుద్దులు చెవినపడగానే వింటున్న భగవద్గోష్ఠిని వదిలి, చటుక్కున ఆ సంభాషణల్లోకి దిగుతారు.





ఓం సాయిరాం



# వరలక్ష్మీ వ్రతం



**సాయిధామం-508126**

గత ఇరవై సంవత్సరాలుగా ఏటా సాయిధామంలో వరలక్ష్మీ వ్రతం జరుగుతూ ఉన్నది. ఈ వ్రతం పరిసర గ్రామాలకు పరిచయం చేసి, ఆయా గ్రామాలలో కూడా (సామూహికంగా) నడిపింది సాయిధామం. ఈ సంవత్సరం కూడా ఇక్కడి **సాయి దేవాలయంలో ఆగస్టు నెల 16వ తేదీ - శ్రావణ శుక్రవారంనాడు - ఉదయం పది గంటలకు** ఈ వ్రతం ప్రారంభమవుతుంది. పాల్గొనదలచినవారు పూజకు నూనె, పూలు, పళ్లు, చేతనైతే (వాయనానికి) 11 కుడుములు లేదా 11 పూర్ణపు బూరెలు కొద్దిగా మొలక సెనగలు తెచ్చుకోండి. మిగిలిన పూజాసామాగ్రి ఆశ్రమం ఏర్పాటు చేస్తుంది.

మీసాటి ముత్తైదువలకు, కన్నెపిల్లలకు కూడా యీ విషయం చెప్పి పూజకు వచ్చేలా చూచి, వారికి కూడా మేలు కలిగించండి. ఐదు సంవత్సరాలు వరుసగా వరలక్ష్మీ వ్రతం చేసుకున్న వారికి విశేషఫలితం ఉంటుంది.

పూజలోని ప్రతి అంశాన్నీ అర్థం చెప్పి వివరిస్తూ చేయించటం యీ ఆలయ ప్రత్యేకత.

ప్రత్యక్షంగా పూజలో పాల్గొనలేనివారు తమ పేరు, భర్తపేరు లేదా తండ్రి పేరు, గోత్ర వివరాలు తెలియజేస్తూ, దక్షిణ ఎం.ఓ. ద్వారా పంపితే వారి పేరిట పూజ జరుపుతారు.

**వ్రతానికి దక్షిణగా రూ. 58/- నిర్ణయింపబడినది.**

**- ధర్మాధికారి,**
**సాయిధామం**
రామలింగంపోస్టు,
బొమ్మలరామవరం మండలం
పిన్ : 508 126

ఫోన్ : 9440413455
9848133565